


# ఎవరు రూపాజీవి?

కథానిక

చచ్చినా కంటికి నిద్రరాదు. కారణం తెలీదు. ఇట్లా ఎన్నిసార్లో?

"అబ్బ! నిద్రపట్టడం లేదురా!" అన్నాను.

"నన్నుచంపక కళ్లుమూసుకొని పడుకో! అదేపడుతుంది నిద్ర" అర్థంలేని సమాధానం. కళ్ళుమూసుకొంటేనే నిద్రవచ్చేస్తే జీవితం ఇంత దుర్భరంగా తయారవకుండా కష్టాలు మర్చిపోవడానికి అనువుగా-కాస్త సుగమంగా వుండేదేమో! అదీగాక నిద్రాదేవికి అంతటి అదంత్రిత్వాన్ని ఆపాదించి అవమానపరచడం నాకేమాత్రమూ ఇష్టంలేదు.

"ఊఁ!" మూలిగాను ప్రక్కకు ఒత్తిగిలుతూ.

"ఎవర్నైనా ప్రేమించావేరా?" హఠాత్తుగా వేశాడు ప్రశ్న.

"ప్రేమిస్తే ఈబాధంతా దేనికి? లేదు గనక నేనోయ్ నాయనా! నువ్వన్నట్లు ఎవర్నైనా ప్రేమించివుంటే బలవంతానా నిద్రపోయేవాణ్ని ఏ మత్తుమందైనాతిని సుఖస్వప్నాలు కంటూ. తియ్యనిబాధలతో...అదో ఆనందం"

"అయితే నీకోసం కాకపోయినా, కనీసం నాకోసమన్నా ఎవరన్నా పిల్లని ప్రేమించరా బాబూ! రోజూ నన్నెందుకిలా చంపుతావు." మావాడి హంబుల్ అభ్యర్థన. పాపం వాడికి మాత్రం విసుగ్గావుండదూ? వారానికి రెండురోజు లయినా - కనీసం-జాగారం చెయ్యవలసి వస్తోంది నాకోసం- నాతోపాటు. అయినా తెలియడం లేదు - హృదయంలో వేదించే అవ్యక్తవ్యథ ఏమిటో? ఎందుకో?

"అబ్బ! దోమలు చంపేస్తున్నాయిరా! రేపు తప్పకుండా డి. డి. టి పౌడరు చల్లాల్సిందే. రోజూ అలాగే అనుకొంటూ మర్చిపోతున్నాం. పీక్కుతినడానికి పెళ్ళాం - బిడ్డలు లేరనుకొని గర్వీస్తూ వుంటే ఆ కాస్తపనీ ఇవ్వి చేసేస్తున్నాయి" మావాడి ఏడుపు.

మళ్ళా కళ్లుమూశాను. ఏమో! ఏక్షణానైనా ఆ దేవికి కటాక్షం కలుగుతుందేమోనని మానవుడి ఆశావాదం. బయటంతా నిశ్శబ్దంగావున్నా గది ప్రక్క రోడ్డుమీదనుంచి అప్పుడప్పుడూ పాదరక్షల చప్పుళ్లు వినిపిస్తూనే వున్నాయి అరుదుగాను - స్పష్టంగాను.

దోమలు చస్తున్నాయో లేదోగాని వాటిశిక్షణార్థం వినియోగింపబడే దెబ్బలతో మావాడి ఒళ్లు వాతలు తేరుతోంది.

"జీవహింస మహాపాపంరా!" అన్నాను వాడి శరీరానికి గట్టిగా దెబ్బలు తగులుతున్నాయని గ్రహించి.

"నువ్వింకా మేలుకొనే వున్నావా?"

"అక్కడికి పెద్ద నువ్వే నిద్రపోయినట్లు?"

"ఏం నిద్రపోను? అబ్బ..." మళ్ళా పడింది కాలిమీద చరుపు.

"లాభంలేదులే! లేచి అలా వెళ్లొద్దాం పద" అన్నాను ప్రక్కమీదనుంచి లేచి నిలబడి. పాపం మానవుడు ఏమనుకున్నాడో ఏమోగాని మాట్లాడకుండా లేచాడు. బహుశా జీవికి అలవాటయిపోయివుంటుంది.

తిరునగర్

సాయిబు చిన్న కాకా హోటల్లో "టీ" త్రాగి బయలుదేరాం. మునిసిపాలిటీవాళ్ళ పుణ్యమా అంటూ లైట్లింకా వెలిగించేవున్నాయి. నడవడం మొదలుపెడితే దూరాన్ని లెక్కించడం ఎవ్వరికీ అలవాటు లేదు. ప్రేమ మొదలుకొని ప్రపంచపు ప్రస్తుత పొలిటిక్సుదాటి వ్యక్తిగత విమర్శల్లోకి గూడా పోయింది చర్చ!

"ఇదేమిటి? స్మశానాల్లోకి దారితీశావు?" అన్నాడు ప్రభాకరరావు హఠాత్తుగా నిలబడి పోయి.

"ఏం? భయమా?"

"కాదులే!" అన్నాడు ఓ అడుగు ముందుకు వేస్తూ. తనుగా తన బలహీనతని-సమానమైనవ్యక్తి ముందు ఒప్పుకోవడం ఎవ్వరికీ యిష్టం వుండదు.

"అయినా ఇటెందుకిప్పుడు?" అన్నాడు.

"ఇక్కడైనా శాంతి దొరుకుతుందేమోనని, కేవలం కోరికలలో పుట్టి, పెరిగి, వాటిలోనే లయమౌతున్న జీవితానికి కోరికల్లేని చోటు ఏమైనా దారి చూపిస్తుందేమోనని ఆశ."

"వేదాంతం మొదలుపెట్టావూ?"

నేను చిన్నగా నవ్వి వూరుకున్నాను.

అప్పుడే చంద్రుడు తూర్పు దిక్కున బలహీనంగా ఉదయిస్తున్నాడు. స్మశానంలో చితి కాలిపోయి నిప్పులింకా మిణుకుమిణుకుమని కనిపిస్తూనే వున్నాయి దూరంగా. మా మీదినుంచి ఓ తీతువు కెవ్వున అరుస్తూ అటు వెళ్ళి మా నెత్తి పైనే రౌండ్లు తిరుగుతోంది. కాళ్లు అడుగల్ని అతిక్రమిస్తున్నకొద్దీ క్షీణ చంద్రుని కాంతిలో కాదుగాని-శేషించిన నిప్పుల క్షీణారుణకాంతిలో అస్పష్టంగా కనిపిస్తోంది.

"అరే ప్రభాకరం, కాస్త అలా పరికించి చూడు" అన్నాను మావాణ్ణి చెయ్యి పట్టుకొని నేను నిలిచిపోయి వాణ్ణి లాగుతూ.

పస్థాయించిచూచి పదహారణాల పచ్చి ఏతీస్టు ప్రభాకరం సహితం నా పక్కకొచ్చి చెయ్యి గట్టిగా పట్టుకున్నాడు.

అంతక ప్రతినిధిస్మశానాంతరాళంలో కూర్చుని రాజ్యం చేస్తున్నాడేమోనని నాలో అనుమానం.

ప్రభాకరానికి దెయ్యాలమీద నమ్మకంలేదు. తన మొత్తం థియరీ అంతా అస్తవ్యస్తమయి పోతోందేమోనని వాడిలో బాధ. ఆ ప్రాణి చలిస్తోంది గూడా.

"మనిషేనేమో?" అన్నాడు ప్రభాకరం.

"ఈ సమయంలో ఒంటరిగా మండుతున్న కాష్టం ప్రక్కనా? నీకు నమ్మదగ్గదిగా వుందా?"

"మనకు మల్లేనే ఏమీతోచక వచ్చిన శ్మశాన శాంతి ప్రియుడేమో?"

కావచ్చు. దెయ్యమే అయితే - అమ్మమ్మ చెప్పినట్లు నిప్పుదగ్గిర కూర్చుండడానికి వీల్లేదుగా అనే విషయం గుర్తుకొచ్చింది. అదీగాక ఇద్దరికీ ఒకేలా కనిపిస్తోంది కూడా!

చప్పట్లు చరిచాడు ప్రభాకరం. గభాలులేచి నిలబడింది. ఏక్షణాన పరుగెట్టే అవసరమొస్తుందో ఆ విషయాన్ని కాళ్ళు విస్మరించకుండా అప్రమత్తతగానే వున్నాయి.

పరకాయించి మావంక చూస్తోంది.

"ప్రేమభగ్నమైపోయిన అభాగ్యులెవరో అయి వుండచ్చు" అన్నాడు ప్రభాకరరావు.

ఇంకా దగ్గిరకు నడిచాం. స్త్రీమూర్తి. వయసు ఎంతైనప్పటికీ కౌమారదశలో వున్న మానవిలా వుంది. ముఖంలో ఎంత దుఃఖాన్నైనా దాచి వెయ్యగల ఓర్పు ఉన్నట్లు కనిపిస్తోంది.

"చచ్చిపోయింది మీవాళ్ళేనా?" ప్రభాకరం అడిగాడు—అదోవిధంగా తల త్రిప్పింది.

"తోడు మీ వాళ్లెవరూ లేరూ?"

ఇప్పుడూ అదే సమాధానం.

"ఏమౌతారు మీకు?"

"ఏమో నాకూ తెలీదు."

"మరి మీరలా ఏడవడం దేనికి?"

"అదీ తెలియకుండానే వుంది" ముఖములో వైరాగ్యభావం ప్రస్ఫుటంగా గోచరిస్తోంది.

"నేనతన్ని ప్రేమిస్తున్నాననుకున్నాను. కానీ అందరూ కాదంటున్నారు."

"మీరు నిజంగా అతన్ని ప్రేమిస్తున్నారా? అయితే ఆయన మీకు..."

"ప్రేమించదగ్గవాడు."

"మీకు భయంగాలేదూ ఇంత రాత్రివేళ ఒక్కరే ఇటువంటి ప్రదేశంలో?"

"నేనూ మనిషినేగా? కనుక తప్పకుండా

వుండాల్సిందే. కాని ఎందుచేతో ఇప్పుడు భయం వెయ్యటంలేదు.”

“మంచు బాగా కురుస్తోంది. అదుగో అక్కడ కూర్చుందాం రండి” అన్నాడు ప్రభాకరరావు.

ఆ పెంకులషెడ్డు అక్కడ ఏ ప్రయోజనం కోసం వేయబడిందో మనకు తెలీదుగాని దాంట్లో ఇప్పుడెవ్వరూ లేరు.

“నా కిక్కడే బావుంది. కొంచెంసేపు మీరూ కూర్చోండి నిప్పు వేడి తగులుతోందిగా!” అంది.

“మీ అంతరాత్మసాక్షిగా మీ రతన్ని ప్రేమిస్తున్నాననుకొంటే ఇంకొకళ్ళతో ప్రమేయం ఏమిటి మీకు? “అన్నాను నేను నిప్పుదగ్గరగా కూర్చుంటూ.

“ఆ సందేహమే నా మనసులోనూ పీడిస్తోంది. బాహ్యప్రపంచాన్ని విని, వినీ దానికే అలవాటు పడిపోయి నా మనస్సునే నేను నమ్మలేకుండా వున్నాను. నిజంగా అది దౌర్బల్యంకదూ?”అంది.

“ప్రపంచమంటే మీకు గాఢనమ్మకమా?”

“కాదనుకోండి...కానీ...”

“అలాంటప్పుడు దాన్నే మీరెందుకు విశ్వశించాలి?”అంతటి ఆవేదనలోనూ ఆ స్త్రీ మూర్తి చిన్నగా నవ్వింది. మీరు చిన్నప్పుడు బ్రాహ్మడూ-దొంగలూ కథ చదవలా? నలుగురు దొంగలు నాలుగుచోట్ల కనిపించి బ్రాహ్మణుడి చేతిలో మేకను కుక్క అని చెప్పినప్పుడు అతనేం చేశాడు? పోనీ మీరు చెప్పగలరా నిర్ణయించి నాకు సమాధానం?”అడిింది.

“ఆధారాలు చెప్పండి”ప్రభాకరరావు అడిగాడు.

“అంతా చెప్పకుండా మిమ్మల్నెలా తీర్పు ఇవ్వమని అడుగుతాను?”

రావిచెట్టుమీదినుంచి ఏదో పెద్దపక్షి ఒకటి గబగబా ఎగురుతూ ఇంకో చెట్టుమీద వ్రాలింది.

“ఆ మంటల్లో దగ్ధమైపోయినాయన లేడూ ఆయనకూ నాకూ ఒక్క శారీరక సంబంధం మాత్రమే! “అంటే ఆయన మీభర్తే నన్నమాట?” ప్రభాకరరావు ఆత్రంగా ప్రశ్నించాడు.

“చెప్పేది వినండి-అతను నా భర్తకాడు.” ప్రభాకరరావు మెదలకుండా వూరుకున్నాడు.

“నేను కులీన కుటుంబంలో ఏమీ పుట్టలేదు. చిన్నతనంనుంచీ నే పెరిగిన వాతావరణాన్నిబట్టి నాకు ప్రేమంటే ఏమిటో అసలు తెలీదనే చెప్పాలి. నిజానికి నే నెవర్నీ ప్రేమించలేదు కూడా! మనశ్శాంతిని కోల్పోయి - మధురక్షణంలో మనోవ్యథను మరిచిపోదలచి వచ్చిన వాళ్ళకు ఆనందాన్ని అమ్మడం; వైవాహిక జీవితం భగ్నమై నరకంగా మారిపోయిన వారికి వారి ఆదర్శాలకు తగినట్లు, అభిరుచులకు తగినట్లు నటించి జీవించడం మావృత్తి. అలాగే చాలాకాలం గడిచిపోయింది. జీవితాంతంవరకూ అలాగే వుండిపోయినా బాగానే వుండిపోయేది. అందరికి మల్లేనే అతన్నీ ఆహ్వానించాను. అతని ప్రతిచేష్టలోనూ ఏదో క్రొత్తదనం ఇంకొకళ్ళలోలేనిదీ కనిపించింది. మనిషి నిశ్శబ్దంగానూ, నిర్లిప్తంగానూ వుంటాడు. అతనిలో ఆశలు అంతరించిపోయాయేమోననిపిస్తుంది. వంద రూపాయలిచ్చాడు. నాకెందుచేతనో అతనిడబ్బు తీసుకోవడం అన్యాయం అనిపించింది. నిజానికది మా నైజానికే విరుద్ధం.

“అబ్బబ్బ - నా...కింత డబ్బు!”

జేబులోనించి ఇంకో వందరూపాయలునోటు తీసియిచ్చాడు. నేను శిలాప్రతిమలా స్థంభించి పోయాను. అతనలాగే వెళ్ళిపోయి మళ్ళా ఓ నెల రోజులతరువాత వచ్చాడు. ఈసారి అతనిదగ్గిర అంతడబ్బులేదు. “అంతఇవ్వలేనే” అన్నాడు.

“పరవాలేదులెండి” అన్నాను.

నాబలవంతాన ప్రతిరోజూ వచ్చేవాడు. అప్పుడప్పుడు తనజీవితాన్నంతా చెప్పుకొని చిన్నపిల్లాడిలా ఏడ్చేవాడు. తనకెవ్వరూ లేరట. కులం బ్రాహ్మణులట. తనుయుద్ధానికి వెళ్ళకముందు తల్లి వుండేదట. తను యుద్ధంలో వుండగానే ఆమె చచ్చిపోయిందట. మిలటరీ పెద్దఉద్యోగమే చేశారట. చదువుకున్నాడు కూడను. మిలిటరీ నుంచి వచ్చేటప్పుడు తెచ్చినడబ్బంతా మొదటి రోజుల్లో జల్సాగా ఖర్చుపెట్టేశాడు. ఎంత బలవంతచేసినా భోజనంమాత్రం ఇంట్లోచేసేవాడు గాదు.

“అవసరమైతే ఏమన్నా డబ్బు అడగటానికి మొహమాట పడకండి” అన్నాను.

“ప్చ్! ఇంకా అదికూడానా? నీకు నేనేమీ

ఇవ్వడంలేదు. సరిగదా నీదగ్గర్నించి తీసుకోనా?" అన్నాడు.

నేనే బలవంతానా ఇచ్చేదాన్ని. కొన్ని రోజుల్లో నే దగ్గర ఏకాస్తయినా మిగిలివుంటే అదిగూడా అయిపోయింది.

ఆత్మాభిమానం ఎక్కువ మనిషికి. అంతఅవస్థపడుతున్నా నాకుచెప్పేవాడు కాదు.

"ఇక్కడికి వచ్చెయ్యగూడదూ?" అన్నాను.

"ఏమిటో నీకు తెగ రుణపడి పోతున్నాను!" అన్నాడు.

అతనేపనీ చేసేవాడుకాదు. తినడం, పుస్తకాలు చదువుకోవడం, ఇంతే. అతనిలో నామీద వట్టి కృతజ్ఞతాభావంతప్ప ఇంకేవిధమైన ఈర్ష్యగానీ, కోపంగానీ కనిపించేవి కావు.

అతనికింకో అలవాటుగూడా వుండేది. పజిల్సు పూర్తిచేసి పంపిస్తూ వుండేవాడు. తన నోటితో నన్నెప్పుడూ ఒక్కకానీ అయినా అడగలేదు. నేనేజేబులో పెడుతూవుండేదాన్ని అతనికెంత కావాలో అంత!

ఒక్కసారిగా అదృష్టం కలిసివచ్చింది. అతనికి పజిల్సులో లక్షా పదివేలరూపాయలు వచ్చేశాయి. చెక్కుతెచ్చి నా చేతికే ఇచ్చాడు.

"నాకెందుకు?" అన్నాను.

"మరేంచెయ్యను దాన్ని?" అన్నాడు అమాయకంగా!

"మీపేర బ్యాంకులో వెయ్యండి" అన్నాను.

"అహ! దాంట్లో నా సొత్తు ఓ కానీ అయినా లేదు. అంతా నీదే" అన్నాడు.

అతను అశిక్షిత జీవితానికి అలవాటుపడ్డవాడని నాకూ తెలుసు. అతనిచేతిలో వుంటే ఎలాటి దుర్వ్యసనాలకు దారితీస్తుందోనన్న ఆలోచన మెరుపులా తట్టింది. ఆ డబ్బు మొత్తం నాపేరనే బ్యాంకిలో వేసేశాడు. పాసిప్టి సొమ్ము వచ్చిందని తెలియగానే ఒకనాడు అతను తమకు చుట్టమని చెప్పుకోడానికే తలవంపులనుకొనేవాళ్లు సహితం ఇప్పుడెంతో దగ్గిరబంధువుల్లాగా అతన్ని చుట్టుముట్టడం సాగించారు. హోదాకు సరిపోయేంత మేడకొన్నాడు. ఇద్దరమూ అందులోనే వుండేవాళ్ళం.

ఓరోజు అతనివెంట ఎవరోవచ్చారు. గదిలోపలేవేవో మాట్లాడుకొన్న తరువాత అతను నా దగ్గరికివచ్చి "పెళ్లిచేసుకోవాలట. సలహాఇస్తున్నాడు" అన్నాడు. ఆ స్వరంలో తనకు పెళ్ళి జన్మజన్మాలకూ ఇష్టంలేనట్లుగా వుంది భావం!

"నేనూ చాలారోజుల్నించీ మీతో అదే చెబుదామనుకొంటున్నాను. మీరు పెళ్లెందుకు చేసుకోగూడదు?" అన్నాను. ఇదంతా గదిలోంచి వింటున్నతను గబగబా గదిబయటికివచ్చి "నేనూ అదే చెపుతున్నానమ్మా. జీవితం ఎల్లకాలం ఇలాగే వుంటుందా? ఓ దిక్కంటూ వుండాలి" అన్నాడు నా మనస్సు చివుక్కుమంది. కానీ దాన్ని వ్యక్తం చేసేంత ధైర్యం నాలో లేదు. ఆయన మళ్ళా అన్నాడు: "ఇస్తామని కాళ్ళదగ్గరికి వస్తున్నారు. ఇప్పుడు చేసుకోకపోతే జీవితంలో ఇంకెప్పుడు పెళ్ళి?" అన్నాడు.

అతన్ని ఒప్పించ నావల్లకాలేదు.

"నాకెందుకు పెళ్ళి?" అన్నాడు.

"ఆయన చెప్పినట్లు ఓదిక్కంటూ వుండాలి."

"పెళ్ళి చేసుకొంటే తప్ప దిక్కే లేకుండా పోతుందా?"

"పోవచ్చు."

"ఇదుగో ఏమంటున్నావో కాస్త ఆలోచిస్తున్నావా?"

"ఆ"

"నాకు దిక్కెవ్వరూ లేరూ?"

అతని ముఖం కందగడ్డయిపోయింది.

"నీ నోటివెంట ఇలాటి మాటలు వింటానని నే నెప్పుడూ అనుకోలేదు. నే నింతవరకూ ఏమనుకున్నానో దాన్నంతటినీ నువ్వు కూకటి వేళ్లతో పెళ్లగించివేశావు. నామీద నీ కేవిధమైన అభిమానమూ లేదా?"

"ఊహు లేదు" నిశ్చలంగా అనేశాను. అలా అనకపోతే అతనిచేత పెళ్ళికి ఒప్పించడం బ్రహ్మతరంగూడా కాదు. రెండోరోజు మధ్యవర్తి పిల్ల తండ్రిని వెంటబెట్టుకొచ్చాడు. పెళ్లికి ఒప్పుకున్నాడని చెప్పాను.

ఓ రోజున అతను కోపంగా ఇంటికొచ్చాడు.

"నే నేమయినాసరే ఈ పెళ్ళి చేసుకోను"

"ఏం?" అన్నాను.

"వాళ్ళకు కావలసింది నేనుకాదు—నాడబ్బు.

ఆ డబ్బంతా నా పేరనే వుండాలట" అన్నాడు మంచంమీద వెల్లకిలా పడుకొని ముఖంమీద చెయ్యి వేసుకున్నాడు.

"వాళ్ళన్నదాంట్లో తప్పేముంది? పాపం చిన్నతనంనుంచీ కనీపెంచిన కూతుర్ని అంత బాధ్యతారహితంగా ఎవరైనా ఇచ్చేస్తారా?" అన్నాను.

మరుసటి రోజునే బ్యాంకులో ఎక్కౌంటు అతని పేరున మార్చబడింది. ఓ శుభముహూర్తాన వివాహం జరిగిపోయింది. పెళ్లికి ముందు పిల్ల తండ్రి వచ్చి నేను పెళ్ళి పందిట్లో కనిపిస్తే బంధువులంతా తిరిగి వెళ్ళిపోతామన్నారనీ, గౌరవం కాపాడ్డానికయినా ఆ రెండు రోజులూ కనిపించవద్దనీ బ్రతిమలాడాడు. అతని శ్రేయస్సుకోసం, భవిష్యత్తుకోసం, గౌరవంకోసం రెండు రోజులు ఎక్కడైనా అజ్ఞాతవాసం చెయ్యలేనూ? అలాగే జరిగింది. కాని ఈ విషయం అతనికి మాత్రం తెలీదు. నూతన వధూవరులు ఓ కొత్త యింట్లో నవజీవనం ప్రారంభించారు.

పెళ్ళయిన దగ్గర్నుంచీ నాదగ్గిరికి అరుదుగా వస్తూ వుండేవాడు. ఆ సంబంధమైనా ఉభయ కుశలోపరితోనే ఆగిపోయేది. కొంత కాలానికి అదీ మానేశాడు. అయినా నేనేమీ కించపడలేదు. అతన్నింకా నాదగ్గిరికి రావాలని కోరుకోవడం ఏమంత సమంజసం? ఏమంత న్యాయం? నేనే వాళ్ళింటికి వెళ్ళి క్రొత్త పెళ్లికూతుర్ని పరామర్శించి వస్తూవుండేదాన్ని.

ఓరోజు నాతో మాట్లాడమే మానేసింది ఆ అమ్మాయి కూడా! కారణమేమైనావుంటే చెప్పమన్నాను. నేను వాళ్ల యింటికి వెళ్లడంవల్ల బంధుకోటిలో వాళ్ళందరికీ కోపంగావుండి చుట్టాలెవ్వరూ ఇంటికే రావడం మానేశారని చెప్పింది. ఆ రోజునుంచీ ఆ యింటికి వెళ్ళడం కూడా మానుకున్నాను. అతని గౌరవం కాపాడవలసిన బాధ్యత నాకుంది గనకే!

ఓరోజు హఠాత్తుగా తెలిసింది అతనికి చాలా తీవ్రంగావుందని. ఎంత నిగ్రహించుకున్నా వుండలేకపోయాను. వాళ్ల యింటికి వెళ్ళాను. చుట్టాలతో ఇల్లంతా నిండిపోయివుంది. నన్ను చూసి అందరూ ముఖాలు మాడ్చుకున్నారు. నేనతన్ని చూసి అనుకున్నంత తీవ్రతలేదని ధైర్యంతో వచ్చేశాను. తరువాత ఓ కుర్రాడితో కబురుపంపారు: "ఇకనించీ ఆ ఇంటిగడప తొక్కితే మర్యాదగా వుండదని." ఆ కుర్రాడివల్ల అతని యోగక్షేమాలు వింటూవుండేదాన్ని.

నే వుంటున్న మేడ తనదేనని కోర్టుద్వారా నోటీసు ఇప్పించాడు పిల్లమామ. సంతకం అతను స్వయంగాచేశాడు. కాదని నేనూ అనలేదు. అతను తానుగా కావాలంటే నేనెదురుచెప్పగలనా? మారు మాట్లాడకుండా మేడ ఖాళీ చేసిఇచ్చేశాను. అప్పట్నించీ రెండుమూడుసార్లు మాత్రం కనిపించాడతను. కాని ప్రతీసారి ముఖం సరిగా చూపించకుండా తప్పించుకుపోయేవాడు.

ఒకసారి మా యింటికొచ్చాడు. "నా మీద కోపంగా వుందా?" అన్నాడు.

"కోపం ఎందుకు? నీది నువ్వు తీసుకున్నావు."

"అయితే నీకు తగిన శిక్షే జరిగింది" అంటూ గబగబా వెళ్లిపోయాడు.

వ్యాధి మళ్ళీ తిరగబెట్టిందట. రక్తపువాంతులవుతున్నాయని తెలిసింది. రెక్కలు కట్టుకొని ఇంటిముందు వాలాను. కాని లోనికి ప్రవేశం ఇవ్వలేదు పిల్లతండ్రి.

"లోపలకు రానివ్వండి."అని నీరసంగా స్వరం వినిపించింది లోపల్నించి.

"నువ్వూర్కో!" కసిరాడు మామ. "ప్రేమట! ప్రేమ. బోగం పడుచుకి ప్రేమేమిటి?" అన్నాడు వికటంగా. ఎంత ప్రయత్నం చేసినా లోపలికి వెళ్ళడానికి వీలు చిక్కలేదు. ఎవరికోసం నా సర్వస్వాన్ని త్యాగంచేసి ధారపోశానో అతన్ని అంతిమఘడియల్లోనైనా చూళ్ళేకపోయాను. ఆ రెండోరోజునే అతను చనిపోయాడు. ఇంటికొచ్చిన చుట్టాలందరూ 'నిన్నే కలవరిస్తూనే చచ్చాడు. మందుపెట్టావేమో'నని నన్ను నోటికొచ్చినట్లు తిట్టారు.

పెద్దలంతా అతనిభార్యను "ఆ భోగంముండ ఈ ఇంట్లో కాలుపెట్టి ఆ శవాన్ని ముట్టుకుంటే మాత్రం నీ మొగుడికి ఖర్మకాండగూడా జరిపించం అనడం నా చెవులారా విన్నాను. అతని భౌతిక దేహాన్నైనా స్పృశించడానికి సాహసించలేకపోయాను. చివరికి వాళ్ళంతా అతన్ని

పూర్తిగా మసిచేసి సమస్త సంబంధాలు తెంపుకొని వెళ్ళిపోయిందాకా కాచుక్కూర్చుని కనీసం అతని అస్థికలైనా జ్ఞాపకార్థంగా తీసుకుపోదామని వచ్చాను" ఆమె చెప్పడం ఆపేసింది.

నిప్పులు చల్లారిపోయాయి వేగుచుక్క పొడిచింది. తీతువుపిట్ట కెవ్వున అరుస్తూ పైన రెండుసార్లు తిరిగిపోయింది.

ప్రభాకరరావు ఆమెకు జడ్జిమెంటు ఏమిస్తాడోనని చెవులు రిక్కించుకొని ఎదురు చూడసాగాను.

"ప్చ్" చప్పరించాడు "అతను మీ ప్రేమకు అర్హుడు కాడేమోనండి" అన్నాడు.

ఆమె అందుకుని "ఆ విషయం మీకు తెలీదులెండి" అంది. స్మశానపు అవతలనుంచి ఎడ్ల మెళ్ళో గంటలు వినిపించాయి. బండి ఇటే వస్తుందన్న మాట. తెల్లవారిపోయినట్లే!

"తెల్లవారిపోయింది. వెళదాం వస్తారా" అన్నాడు ప్రభాకరం.

"వెళ్ళక ఏంచెయ్యగలం? ఆడవాళ్ళు ఏవేవో చెయ్యాలనుకొని ఏమీచెయ్యలేక చిట్టచివరికి ఆడవాళ్ళుగానే వుండిపోతారు" అంటూ గుప్పెడు బూడిద చెంగున కట్టుకులేచి నిలబడింది.

నాకు ఈ రాత్రి ఎలాగో గడచిపోయిందన్న సంతృప్తికంటే ఈ పాపిష్టి శ్రవణాలతో విన్న మానవ కథనం వారంరోజులవరకూ జాగరం చేయించగలగడానికి హేతువయిందేనన్న బాధ ఎక్కువగా పీడిస్తోంది.

స్కెచ్

# లాభనష్టాలం

"హితశ్రీ"

"ఆనందరావ్!"

వెనక్కి తిరిగిచూశాడు ఆనందరావు. గబగబ అడుగులేసుకుంటూ రామనాథం తనవైపే వొస్తూండటం చూసి మర్యాదకోసం అతనుకూడా రామనాథం వైపు నడిచాడు. ఇద్దరూ కలుసుకోగానే మళ్ళీ నడక ముందుకి సాగింది.

"ఎక్కడిదాకా?"

"మీటింగుకి."

"నేనూ అక్కడికే, పద."

జరగబోయే మీటింగుని గురించీ, మాట్లాడబోయే వ్యక్తుల్ని గురించీ సంభాషణ కాసేపు జరిగి ఆగిపోయింది. రామనాథం ఓ చిన్న దగ్గు దగ్గి కొంచం వేదాంత ధోరణిలో భవబంధాల్ని గురించి ముచ్చటించి విరక్తిగా అన్నాడు.

"ఏమిటోనోయ్, ఈ సంసారపు గొడవల్తో మహా బాధగా ఉంది."

అందులో అసహజమేమీలేదని ఒప్పుకున్నాడు ఆనందరావు. కాసేపు ఊరుకుని రామనాథం అకస్మాత్తుగా అడిగాడు.

"ఎప్పుడైనా ఆలోచించావూ?"

"ఏమిటి?"

"డబ్బులేకపోతే మనం ఏవిధంగానైనా చలామణీ కాగలమంటావా?"

"ఎబ్బే!" అన్నాడు ఆనందరావు-రామనాథం ప్రశ్నలోనే అందించిన సమాధానం గ్రహించి.

"ఎందుకోయ్, వెధవజీవితం."

"ఏం అంతవిరక్తిగా ఉన్నావ్?"

"వెధవడబ్బు."

"ఏమయిందేమిటి?"

"ఇంకా ఏమీకాలేదులే."

"ఏమైనా కాబోతోందా?"

"ఒకటేమిటి, లక్షకాబోతున్నాయి. ఏం చేస్తాం?"

తరవాత రామనాథం ఇంకేమీ మాట్లాడలేదు - కాబోయే విషయాన్ని గురించి. వినే ఓపికా, ఇష్టమూకూడాలేని ఆనందరావు లోలోపల కొంత సంతోషించి, ఎందుకైనా మంచిదని ఓ సిగరెట్ ముందుగానే రామనాథంకి బహూకరించి తనూ ఒకటి స్వీకరించాడు. కాసేపు సిగరెట్ పొగలో నిమగ్నుడై నిశ్శబ్దాన్ని పాటించి రామ